మెయిన్
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 8
సంచిక : 145
పేజీలు : 3
ఆదివారం 21.12.2025
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను
కేంద్రప్రభుత్వ డిజిటల్ మీడియా (2021) గైడ్ లైన్స్‌కి లోబడి నిర్వహణలో ఉన్న జీఎస్టీ లైసెన్స్ కలిగిన టీమీడియా (డిజిటల్) లో పని చేయడానికి మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను.
అనుభవం ఉన్న వారికీ ప్రాధాన్యత, కొత్త వారికీ అవకాశం కలదు.
వివరాలకు కోసం : 8919710365, 7382990365, 8498972434 కాల్ / మెసెజ్ చేయండి.
GSTIN:36FDKPS1308P1ZX
టి-మీడియా సామాజికం ... ప్రజల పక్షం...
epaper,www.tmedia.net.in YouTube facebook

## ఇతర మతాలను కించపరిస్తే...
# కఠిన చర్యలు





- సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

**టి మీడియా,డిసెంబర్ 20,హైదరాబాద్ బ్యూరో:**
ద్వేషించే వారిని కూడా ప్రేమించేలా ఏసు ప్రభువు చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించడానికి ఏసు ప్రభువు జన్మించారన్న సీఎం కాంగ్రెస్ పార్టీకి కూడా డిసెంబర్ నెల కీలకమైందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ కూడా డిసెంబర్ నెలలోనే జన్మించినట్లు గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్న వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ పాల్గొన్నారు. వీరితో పాటు మంత్రుల పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. తెలంగాణలో క్రిస్మస్ జరుపుకుంటున్నామంటే అందులో సోనియాగాంధీ పాత్ర, త్యాగం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇదే డిసెంబర్‌లో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. ఏసు ప్రభువు బోధనల స్ఫూర్తితో తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. శాంతిని కాపాడుతూనే సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు.

### పేదల ఇళ్లలో వెలుగులు నింపాం
పేదవాడి ఆకలి తీర్చాలని ఆనాడు కాంగ్రెస్ పార్టీ ఆహార భద్రత చట్టం తెచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో ప్రతి పేదవాడికి నెలకు 6 కిలోల సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. ఉచిత విద్యుత్ పథకం ద్వారా పేదల ఇళ్లలో వెలుగులు నింపామన్నారు. రెండేళ్లలో వ్యవసాయంపై రూ.1.04 లక్షల కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలిపారు. క్రిస్టియన్ మిషనరీలు ప్రభుత్వంతో పోటీ పడి విద్య, వైద్యం అందించాయని అన్నారు.
మైనార్టీలకు అందించే సంక్షేమం దయ కాదని అదీ వారి హక్కు అని సీఎం రేవంత్ తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్?లకు సంబంధించిన స్మశానాలకు స్థలం ఇవ్వాలంటే ప్రభుత్వం వద్ద లేదని ఊరికి దూరంగా స్మశానాలు నిర్మించుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. అన్ని మతాలపట్ల తాము సమానంగా ఉంటామన్న సీఎం ఇతర మతాలను కించపరిచేలా వ్యవహారిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశంలో హెట్ రేట్ చట్టం ప్రవేశపెడతామని చెప్పారు.

### క్రిస్మస్ వేడుకల కోసం రూ.33 కోట్ల నిధులు
సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని మతాలు, వర్గాల ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని మంత్రి అజారుద్దీన్? అన్నారు. క్రిస్మస్ వేడుకలను సీఎం ఘనంగా జరిపిస్తున్నారని తెలిపారు. మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం కోసం ఆయన చేస్తున్న మేలుకు ఎప్పుడూ అండగా ఉంటూ మద్దతూ ఇస్తామని అన్నారు. క్రిస్మస్ వేడుకల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.33 కోట్ల నిధులు కేటాయించి నట్లు క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్ వెల్లడించారు. రూ.30 వేల చొప్పున రాష్ట్రంలోని 7 వేల చర్చిలకు నిధులు అందుతాయని తెలిపారు.

## ఎంజైరేగాను బుల్డోజర్‌తో
# తొక్కిన మోదీ సర్కార్
### పేదల ప్రయోజనాలపై దాడి: సోనియా



**టి మీడియా,డిసెంబర్ 20, ఢిల్లీ బ్యూరో :**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఎంజైరేగా ను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బుల్డోజర్‌తో తొక్కేసిందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ చట్టాన్ని రద్దు చేసి తీసుకొచ్చిన కొత్త బిల్లును ఆమె "బ్లాక్ లా"గా అభివర్ణించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు చెందిన లక్షలాది కార్యకర్తలు ఈ చట్టాన్ని ధిక్కరిస్తారని స్పష్టం చేశారు. శనివారం విడుదల చేసిన వీడియో సందేశంలో సోనియా గాంధీ మాట్లాడుతూ, ఎంజైరేగా ను బలహీనపరచడం ద్వారా కేంద్ర ప్రభుత్వం కోట్లాది రైతులు, కూలీలు, భూమిలేని పేదల ప్రయోజనాలపై దాడి చేసిందని అన్నారు.


### విప్లవాత్మక అడుగుగా నిలిచింది
గత 11 ఏళ్లుగా గ్రామీణ పేదల సంక్షేమాన్ని కేంద్రం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. గ్రామీణ ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన ఆమె, 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రధాని డా. మన్మోహన్ సింగ్ నాయకత్వంలో పార్లమెంట్‌లో ఏకాభిప్రాయంతో ఎంజైరేగా చట్టం ఆమోదం పొందిన రోజును తాను ఇప్పటికీ స్పష్టంగా గుర్తు పెట్టుకున్నానని తెలిపారు. ఆ చట్టం విప్లవాత్మక అడుగుగా నిలిచిందని, పేదలు, నిరుపేదలు సహా అనేక మందికి జీవనాధారంగా మారిందని చెప్పారు.

### ఎంజైరేగాపై బుల్డోజర్
ఎంజైరేగా వల్ల ఉపాధి కోసం వలసలు తగ్గాయని, ఉద్యోగం పొందే హక్కు చట్టబద్ధంగా లభించిందని, గ్రామ పంచాయతీలకు అధికారం పెరిగిందని సోనియా గాంధీ గుర్తుచేశారు. మహాత్మా గాంధీ కలల గ్రామ స్వరాజ్యం వైపు ఇది ఒక దృఢమైన అడుగు అని ఆమె వ్యాఖ్యానించారు. అయితే తాజాగా ప్రభుత్వం ఎంజైరేగా పై బుల్డోజర్ నడిపిందని ఆమె విమర్శించారు. మహాత్మా గాంధీ పేరు తొలగించడమే కాకుండా, ఎలాంటి చర్చలు లేకుండా, ఎవరినీ సంప్రదించకుండా, ప్రతిపక్షాలను విశ్వాసంలోకి తీసుకోకుండా ఈ చట్టం రూపురేఖలనే మార్చేశారని మండిపడ్డారు. కొత్త చట్టం ప్రకారం ఎవరికెంత ఉపాధి ఇవ్వాలి, ఎక్కడ ఇవ్వాలి, ఎలా అమలు చేయాలన్నది ఢిల్లీలో కూర్చున్న ప్రభుత్వమే నిర్ణయిస్తుందని, ఇది గ్రామీణ వాస్తవ పరిస్థితులకు పూర్తిగా దూరమని అన్నారు.

### కోట్లాది మందిపై దాడి చేసినట్లే
ఎంజైరేగా ను తీసుకురావడంలో, అమలు చేయడంలో కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని, అయితే ఇది ఎప్పుడూ పార్టీకి పరిమితమైన పథకం కాదని సోనియా గాంధీ స్పష్టం చేశారు. ఇది జాతీయ ప్రయోజనాలకు, ప్రజల హితానికి సంబంధించిన చట్టమని చెప్పారు. ఈ చట్టాన్ని బలహీనపరచడం ద్వారా గ్రామీణ రంగంలో కోట్లాది మంది రైతులు, కూలీలు, భూమిలేని పేదలపై దాడి చేసినట్లేనని ఆమె అన్నారు. "ఇరవై ఏళ్ల క్రితం పేదలకు ఉపాధి హక్కు సాధించేందుకు నేను పోరాడాను. నేడు ఈ బ్లాక్ లాకు వ్యతిరేకంగా పోరాడేందుకు అదే కట్టుబాటుతో ఉన్నాను. నా లాంటి కాంగ్రెస్ నాయకులంతా, లక్షలాది కార్యకర్తలు మీతో కలిసి నిలబడతారు" అని ఆమె భరోసా ఇచ్చారు.
ఇదిలా ఉండగా, ఎంజైరేగా ను భర్తీ చేయనున్న వైబ్-జి రామ్ జి బిల్లును పార్లమెంట్ ఇటీవల ఆమోదించింది. ఈ బిల్లు గ్రామీణ ప్రాంతాల్లో సంవత్సరానికి 125 రోజుల ఉపాధి హామీ ఇస్తుందని కేంద్రం చెబుతోంది. అయితే ఈ బిల్లుపై ప్రతిపక్షాలు తీవ్రంగా నిరసన వ్యక్తం చేశాయి. మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని వ్యతిరేకించడంతో పాటు, ఆర్థిక భారం రాష్ట్రాలపై మోపుతున్నారని ఆరోపించాయి. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాత్రం, పాత పథకంలో ఉన్న లోపాలను సరిదిద్దేందుకే కొత్త చట్టం అవసరమని సమర్థించారు. లోక్‌సభ ఆమోదం అనంతరం రాజ్యసభలోనూ వాయిస్ ఓటుతో బిల్లును ఆమోదించారు. కాంగ్రెస్ పార్టీ ఈ కొత్త చట్టానికి వ్యతిరేకంగా తమ పోరాటాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్తామని ఇప్పటికే ప్రకటించింది.

## దశాబ్దాలుగా కాంగ్రెస్ చేసిన
# తప్పులను సరిచేస్తున్నాం

- ప్రధాని మోదీ



**టి మీడియా,డిసెంబర్ 20, ఢిల్లీ బ్యూరో :**
కాంగ్రెస్?పై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అసోంతో పాటు ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి కాంగ్రెస్ ఎజెండాలో ఎప్పుడూ లేదని ఆయన మండిపడ్డారు. ఈశాన్య భారతంలో దశాబ్దాలుగా కాంగ్రెస్ చేసిన తప్పులను తాము సరిచేస్తున్నామన్నారు. శనివారం అసోంలోని గువాహటిలో లోకప్రియ గోపీనాథ్ బర్దోలోయి అంతర్జాతీయ విమానాశ్రయంలో నూతన టెర్మినల్ భవనాన్ని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోం తొలి ముఖ్యమంత్రి గోపీనాథ్ బర్దోలోయి విగ్రహాన్ని మోదీ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బర్దోలోయి అసోంను భారత్?లో భాగంగా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించారని, ఆయన సేవలు చిరస్మరణీయమని ప్రధాని కొనియాడారు. స్వాతంత్ర్యానికి ముందు గోపీనాథ్ బోర్దోలాయి అసోంను కాపాడారని, కానీ ఆయన తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు రాష్ట్ర, దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డాయని మోదీ ఆరోపించారు. ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం మతపరమైన బుజ్జగింపులకు కాంగ్రెస్ ప్రాధాన్యత ఇచ్చిందని దుయ్యబట్టారు. బంగాల్, అసోంలో చొరబాటుదారులకు బహిరంగంగా అనుమతులు ఇచ్చిందని ఆయన విమర్శించారు. ఫలితంగా అడవులు, ప్రభుత్వ భూములు అక్రమణకు గురైనట్లు చెప్పారు. దీనివల్ల ఈ ప్రాంతాల జనాభా స్వరూపంతో పాటు అసోం రాష్ట్ర భద్రత, సాంస్కృతిక గుర్తింపు తీవ్ర ప్రమాదంలో పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈశాన్య ప్రాంతాలను అభివృద్ధికి దూరం పెట్టడం వల్ల దేశం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని మోదీ మండిపడ్డారు. దేశ ఐక్యత, భద్రత, సమగ్రత అన్నింటికీ తీవ్ర నష్టం జరిగిందన్నారు. కాంగ్రెస్ పాలనలో దశాబ్దాల పాటు హింస రాజ్యమేలిందని విమర్శించారు. కేవలం 11 ఏళ్లలోనే ఆ పరిస్థితిని పూర్తిగా మార్చే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఒకప్పుడు హింసతో అల్లాడిన ఈశాన్య ప్రాంతాలు ఇప్పుడు అభివృద్ధి బాట పట్టాయన్నారు. గతంలో హింస ప్రభావిత జిల్లాలుగా పిలిచిన ప్రాంతాలు ఇప్పుడు ఆకాంక్షిత జిల్లాలుగా మారాయన్నారు. ఈ సందర్భంగా అసోం సీఎం సీఎం హిమంతబిశ్వ శర్మను ప్రధాని ప్రశంసించారు. హిమంత ప్రభుత్వం ఆక్రమణదారుల నుంచి రాష్ట్ర వనరులను విముక్తం చేసేందుకు కఠినంగా పనిచేస్తోందన్నారు. అసోంను రక్షించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటోందన్నారు

## రికార్డు స్థాయిలో
# ధాన్యం కొనుగోలు

- 77.33 శాతం పూర్తి
- రూ.12,684 కోట్లు రైతుల ఖాతాల్లో జమ



**టి మీడియా, డిసెంబర్ 20 , హైదరాబాద్ :**
వానాకాలం వరిధాన్యం రికార్డు స్థాయిలో కొనుగోలు జరిగింది. ఇప్పటివరకు 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగింది. అక్టోబర్ నుంచి ప్రారంభమైన ధాన్యం సేకరణ.. దాదాపు 77.33 శాతం వరకు పూర్తయింది. మిగ తా ధాన్యం కూడా త్వరితగతిన పూర్తిచేయాలనే సంకల్పం తో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళుతోంది. ధాన్యం సేకరణ కోసం పౌరసరఫరాల శాఖ రాష్ట్రవ్యాప్తంగా రైతులకు 8,443 కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి

మిగతా 3లో..

## నేడు బీఆర్‌ఎస్‌ఎల్పీ మీటింగ్
### హైదరాబాద్ చేరుకున్న కేసీఆర్



**టి మీడియా,డిసెంబర్ 20 ,హైదరాబాద్ బ్యూరో :**
బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన నేడు మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ఎల్పీ, రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఎర్రవల్లి నుంచి హైదరాబాద్ నంది నగర్ నివాసానికి కేసీఆర్ వచ్చారు. నేడు మధ్యాహ్నం 2 గంటలకు జరగనున్న భేటీలో తెలంగాణ రాష్ట్రానికి జరుగుతున్న జలదోపిడీపై చర్చించనున్నారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై, పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులను నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకుపోవడంలో చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై ఈ సమావేశంలో చర్చ జరుగనున్నది. గోదావరి, కృష్ణ జలాలను కొల్లగొడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దోపిడీని అడ్డుకోవడంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఈ క్రమంలో తెలంగాణ ప్రజల రైతాంగ సాగునీటి హకులను కాపాడుకోవడానికి మరో ప్రజా ఉద్యమం తప్పదని బీఆర్ఎస్ భావిస్తున్నది. ఏపీ జలదోపిడీపై తెలంగాణ ప్రజా ఉద్యమాలు ఎలా చేపట్టాలనే అంశంపై పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి అధినేత కేసీఆర్ లోతుగా

మిగతా 3లో..

## అమరావతి రైల్వేలైన్‌కు
# 'భూ' చిక్కులు

- రైతుల పట్టు, సర్కార్ నిర్ణయంపై ఉత్కంఠ



**టి మీడియా, డిసెంబర్ 20 , అమరావతి :**
రాజధాని అమరావతికి రైలు కూత వినిపించేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. అయితే, ఈ ప్రాజెక్టుకు ఇప్పుడు 'భూ' కష్టాలు ఎదురయ్యాయి. రైలు మార్గం కోసం తమ భూములు ఇచ్చేది లేదని రైతులు చెబుతున్నారు. భూసేకరణ విధానం తమకు వద్దని, రాజధాని అమరావతికి ఇచ్చినట్లుగానే భూసమీకరణ

మిగతా 3లో..

## పంచాయతీల్లో
# ఆర్థిక కష్టాలు

- కొత్త సర్పంచులు తర్జన భర్జన



**టి మీడియా,డిసెంబర్ 20,హైదరాబాద్ బ్యూరో :**
తెలంగాణలో ఎన్నిక అయిన పంచాయతీ పాలకవర్గం ఈ నెల 22న కొలువుదీరనుంది. కొన్ని జిల్లాల్లోని పంచాయతీల ఖజానా ఖాళీగా ఉండటంతో కొత్త సర్పంచులు తర్జనభర్జన పడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో అభివృద్ధిపై నూతన పాలకులపైనే ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఐతే పంచాయతీల ఖజానా లేకపోవడంతో పనులు ఎలా చేయాలనే ఆందోళన కొత్త సర్పంచుల్లో

మిగతా 3లో..

# సివిల్ సప్లయ్‌లో అవినీతి

- అదనపు కలెక్టర్ పట్టుబడడంతో వెలుగులోకి
- అక్రమాలపై విచారణకు ఆదేశించిన కలెక్టర్



**టి మీడియా, డిసెంబర్ 20, హనుమకొండ :**
హనుమకొండ జిల్లా పౌరసరఫరా శాఖ కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతున్నది. ధాన్యం కొనుగోలు కేంద్రాల కేటాయింపులు, రైస్‌మిల్లుల ట్యాగింగ్, సీఎంఆర్ డెలివరీలో అధికారులు మిల్లర్లతో కుమ్మక్కై పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తున్నది. ఇందుకు రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లోని ఓ ముఖ్య నాయకుడు కీలకపాత్ర వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల విజిలెన్స్ అధికారులు అతడి మిల్లులో దాడులు చేసి ధాన్యం తక్కువ ఉందని గుర్తించినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. ఈ క్రమంలో అదనపు కలెక్టర్ ఏసీబీకి పట్టుబడడంతో సివిల్ సప్లయ్ శాఖలో జరిగిన అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయని ప్రచారం జరుగుతున్నది. ఈ విషయంపై కలెక్టర్ స్నేహా శబరీష్ సీరియస్ అయి ఆ శాఖలోని ఉద్యోగులను సైతం బదిలీ చేసింది. అంతేగాక విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. 2024-25 యాసంగి, 2025-26 వానకాలం ధాన్యం కేటాయింపుల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. సీఎంఆర్ పనితీరు, టెన్నేజ్ కెపాసిటీ, గోడౌన్ స్పేస్, బ్యాంకు గ్యారెంటీ అంశాలను పరిగణలోకి తీసుకోకుండా మిల్లలు కేటాయించినట్లు తెలుస్తున్నది. ఇందుకుగాను రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌లోని ఓ ముఖ్య నాయకుడు అన్నీ తానై వ్యవహరించాడు. గత సీజన్లలో సీఎంఆర్ బాకీ ఉంటే బ్యాంక్ గ్యారెంటీ నుంచి కట్ చేసుకొని ధాన్యం కేటాయించాల్సి ఉండగా అవేవీ పాటించలేదని తెలిసింది. ఓ ముఖ్య నాయకుడి మిల్లుకు సంబంధించి రెండు వేల ధాన్యానికి బ్యాంకు గ్యారెంటీ ఇస్తే 6 వేల ధాన్యం కేటాయించినట్లు సమాచా రం. గత సీజన్లలో సీఎంఆర్ 80 శాతం ఇచ్చిన మిల్లులకు ట్యాగింగ్ చేయకుండా, 40 శాతం కూడా ఇవ్వ ని వాటికి ధాన్యం కేటాయించడంపై పలువురు మిల్లర్లు మండిపడుతున్నారు. ఈ వానకాలంలో ట్యాగింగ్ లేకుండా కొనుగోలు కేంద్రాల నుంచి నేరుగా రైస్ మిల్లలకు తరలిస్తున్నట్లు తెలిసింది. దీంతో రైతులు నష్టపోయే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**విచారణ చేస్తున్నాం**
కలెక్టర్ ఆదేశాల మేరకు 2025-26 వానకాలం సంబంధించి రైస్‌మిల్లుల ట్యాగింగ్, బ్యాంకు గ్యారెంటీ, కేటాయించిన ధాన్యం తదితర అంశాల అవినీతి వ్యవహారంపై విచారణ చేస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా ఏ మిల్లుకైనా ధాన్యం కేటాయిస్తే వాటిని తక్కువ ఉన్న మిల్లులకు తరలిస్తాం. రవాణా ఖర్చులను నిబంధనలు అతిక్రమించిన మిల్లర్ నుంచి వసూలు చేస్తాం. తుది నివేదికను అందజేసి, కలెక్టర్ నిర్ణయం మేరకు ముందుకు నడుస్తాం.
(ఎండీ వాజిద్ అలీ, డీసీఎస్‌వో హనుమకొండ)

**అక్రమాలపై కలెక్టర్ నజర్**
సివిల్ సప్లయి శాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రత్యేక దృష్టి సారించి డీఎస్‌వో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌ను బదిలీ చేసింది. ఈ వానకాలంలో మిల్లులు, బ్యాంకు గ్యారెంటీ, కేటాయించిన ధాన్యం తదితర అంశాలపై విచారణ చేసి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అక్రమాలకు పాల్పడ్డ మిల్లర్లు ఆందోళన చెందుతున్నట్లు సమాచారం.



## రైలు నుంచి జారిపడి దంపతులు మృతి

**టి మీడియా,డిసెంబర్ 20, యాదాద్రి భువనగిరి :**
పెళ్లైన నవ దంపతులను రైలు ప్రమాదం రూపంలో మృత్యువు కాటేసిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో వెలుగు చూసింది. ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం జిల్లా గురుగుబిల్లి మండలం రావుపల్లికి చెందిన కోరాడ సింహాచలం (25)కి అదే జిల్లాలోని అంకవరం గ్రామానికి చెందిన భవాని (19)తో రెండు నెలల క్రితం వివాహమైంది. వీరిద్దరు హైదరాబాద్ జగద్గిరిగుట్టలోని గాంధీనగర్‌లో నివాసముంటున్నారు. సింహాచలం, భవానీ విజయవాడలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలులో సికింద్రాబాద్ నుంచి బయలుదేరారు. అయితే యాదాద్రి భువనగిరి జిల్లా వంగపల్లి-ఆలేరు రైలు మార్గంలో వంగపల్లి రైల్వే స్టేషన్ దాటిన తర్వాత డోర్ వద్దున్న దంపతులిద్దరూ ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దంపతులిద్దరు మృతి చెందడంతో ఇరు కుటుంబాల్లో విషాదం చోటుచేసుకుంది.



## నూతన సర్పంచ్‌కు నేతకానీ గూడెం సన్మానం

**టీ మీడియా,డిసెంబర్ 20, కొత్తపేట:**
గ్రామపంచాయతీ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన జిరెడ్డి మహేందర్ రెడ్డికి నేతకానీ దేవునిగూడెంగ్రామప్రజలు,సభ్యులు అత్యంత ఆత్మీయంగా,ఘనంగా సన్మానంచేశారు. శనివారం నేతకానీ గూడెంలో జరిగినఈకార్యక్రమంలో,గూడెంపెద్దమనుషులు,మహిళలు సర్పంచ్ మహేందర్ రెడ్డికి,ఉప సర్పంచ్ సింహారాజు క్రాంతి వార్డ్ మెంబెర్ శైలజ రమేష్ కు,శాలువాలుకప్పిఅభినందనలు తెలిపారు. దేవుని గూడెం తరఫున కేక్ కట్ చేసి,స్వీట్ లు పంచి తమ సంతోషాన్నివ్యక్తపరిచారు. ఈ సందర్భంగా నేతకానీ గూడెం యువకులు,పెద్దలు మాట్లాడుతూ,నూతన సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని మౌలిక సదుపాయలుకల్పించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తదానంతరం సర్పంచ్ జిరెడ్డి మహేందర్ రెడ్డిమాట్లాడుతూ, తనను గెలిపించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ గ్రామాభివృద్ధికి,ప్రజల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీఇచ్చారు. ఈ సన్మానం తన బాధ్యతను మరింత పెంచిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతకానీ దేవుని గూడెంకు చెందిన యూత్,బండారిసతీష్,బండారిశ్రీకాంత్,బండారి రాజేష్,జాడి కుమారస్వామి, కడారి దినేష్, కడారి సత్తయ్య, చెరుకుస్వామి, రాజబాబు, కడారిగంగరాజాం, కడారిఅశోక్, గూడెంపెద్దలు జాడిమల్లయ్య, కడారిలింగయ్య, జాడిశంకరయ్య, బండారి పోచయ్య, చెరుకు భుచ్చయ్య.

# టీ20 జట్టును ప్రకటించిన బీసీసీఐ

## ఐసీసీ ఈవెంట్ నుంచి శుభ్‌మన్ గిల్ అవుట్

**టి మీడియా,డిసెంబర్ 20, ఢిల్లీ బ్యూరో :**
వచ్చే ఏడాది భారత్-శ్రీలంక వేదికగా జరుగనున్న టీ20 ప్రపంచకప్‌లో సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని టీమిండియా డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలో దిగనున్నది. ఈ సారి టైటిల్‌ను నిలబెట్టుకోవాలని భారత జట్టు భావిస్తున్నది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని జాతీయ సెలక్షన్ కమిటీ శనివారం టీ20 ప్రపంచ టోర్నమెంట్ కోసం 15 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రధాన కార్యాలయంలో జరిగిన సెలక్షన్ కమిటీ సమావేశంలో జట్టును ఎంపిక చేసింది. ఇదే జట్టు జనవరిలో న్యూజిలాండ్‌తో జరిగే టీ20 సిరీస్‌లో కూడా ఆడనుంది. రోహిత్ శర్మ కెప్టెన్సీలో భారత్ 2024లో దక్షిణాఫ్రికాను ఓడించి ట్రోఫీని గెలుచుకుంది. భారత్ తన టైటిల్‌ను నిలబెట్టుకోవాలనే సంకల్పంతో ఈ టోర్నమెంట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నది. ఈ ఇది టోర్నమెంట్ 10వ ఎడిషన్. ఈ టోర్నమెంట్‌లో ఇప్పటి వరకు ఏ జట్టు కూడా టైటిల్‌ను నిలబెట్టుకోలేకపోయాయి. సొంత గడ్డపై ఈ రికార్డును బద్దలు కొట్టాలని టీమిండియా కృతనిశ్చయంతో ఉన్నది. టీ20 ప్రపంచ కప్ కోసం భారత జట్టులో శుభ్‌మన్ గిల్ దూరమయ్యాడు. మొన్నటి వరకు వైస్ కెప్టెన్‌గా కొనసాగిన గిల్ స్థానంలో అక్షర్ పటేల్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. ఇటీవల ఫామ్ లేమితో గిల్ ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్, రింకు సింగ్ జట్టులోకి తిరిగి వచ్చారు. ఇషాన్ చివరిగా 2023 నవంబర్ 28న ఆస్ట్రేలియాపై భారత్ తరపున చివరి మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత ఇషాన్ దక్షిణాఫ్రికా పర్యటనకు ఎంపికయ్యాడు. కానీ అక్కడ ఒక్క మ్యాచ్ కూడా ఆడే ఛాన్స్ రాలేదు. పర్యటన మధ్యలోనే ఇషాన్ తిరిగి స్వదేశానికి వచ్చాడు. దేశవాళీ క్రికెట్ కంటే ఐపీఎల్‌కు ప్రాధాన్యత ఇస్తున్నాడన్న విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే జాతీయ జట్టులో చోటు కోల్పోయాడు. తాజాగా రెండేళ్ల తర్వాత జట్టులోకి తిరిగి వచ్చాడు. రింకు సింగ్ చివరిసారిగా ఆసియా కప్‌లో ఆడాడు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో మాత్రం చోటు దక్కలేదు. శుభ్‌మన్ గిల్ స్థానంలో అక్షర్ పటేల్‌ను టీ20 జట్టు వైస్ కెప్టెన్‌గా నియమించారు. అక్షర్ గతంలో కూడా టీ20ల్లో వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. వాస్తవానికి ఈ సారి ఎవరూ ఊహించని విధంగా ఇషాన్ కిషన్ జట్టులోకి తిరిగి వచ్చాడు. కిషన్ ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఫైనల్‌లో 101 పరుగులు చేశాడు. టోర్నమెంట్ మొత్తం అద్భుతమైన బ్యాటింగ్‌తో అలరించాడు. ఇషాన్ చేరికతో జితేష్ శర్మ చోటు కోల్పోయాడు. సంజు శాంసన్ వికెట్ కీపర్‌గా వ్యవహరిస్తాడు. జట్టును ప్రకటించే సమయంలో అజిత్ అగార్కర్ మాట్లాడుతూ సంజు శాంసన్ వికెట్ కీపర్‌గా కొనసాగుతాడని తెలిపాడు. గిల్ జట్టులో లేకపోవడంతో అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నాడు. శాంసన్, అభిషేక్ ఓపెనింగ్ జోడీ అద్భుతంగా ఉంటుంది. గతంలో ఇద్దరు ఓపెనర్లుగా వచ్చి పరుగుల వరద పారించారు. దక్షిణాఫ్రికాతో జరిగిన ఐదవ టీ20లోనూ ఇదే దృశ్యం కనిపించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు టీ20 ప్రపంచకప్ జరుగనున్నది. భారత్-శ్రీలంక సంయుక్తంగా టీ20 ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇస్తున్నాయి. ఇప్పటికే ఐసీసీ వేదికలను ఖరారు చేసిన విషయం తెలిసిందే. టీమిండియా టీ20 ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7న ముంబయిలో యూఎస్ఏతో ఆడుతుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 12న నమీబియాతో ఢిల్లీలో ఆడుతుంది. ఫిబ్రవరి 15న కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో పాకిస్తాన్‌తో మ్యాచ్ ఆడుతుంది. అనంతరం ఫిబ్రవరి 18న అహ్మదాబాద్‌లోని భారీ నరేంద్ర మోదీ స్టేడియంలో నెదర్లాండ్స్‌తో చివరి గ్రూప్ మ్యాచ్ ఆడుతుంది.




**టీ20 ప్రపంచకప్ కోసం భారత జట్టు**
సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), రింకూ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, ఇషాన్ కిషన్, వరుణ్ చక్రవర్తి.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- సీఐ ప్రసాద్ రావు




**టీ మీడియా,డిసెంబర్ 20,రామగుండం :**
క్రైమ్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా,ఈ నెల 21న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద్ రావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కేసులను త్వరితగతిన, తక్కువ ఖర్చుతో పరిష్కరించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న చిన్న క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ చలానాలు, సివిల్ వివాదాలు వంటి అంశాలను పరస్పర అంగీకారంతో సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. భారత ప్రభుత్వం, న్యాయ సేవల అధికార సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ జాతీయ లోక్ అదాలత్ ప్రజలకు తక్షణ న్యాయం అందించే శాంతియుత పరిష్కార వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా ఇరు పక్షాలు పరస్పర సమ్మతితో సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు, న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల భారాన్ని కూడా తగ్గించవచ్చని వివరించారు. కోర్టుల్లో నడుస్తున్న కేసులను తక్కువ సమయంలో ముగించుకునేందుకు ఇది మంచి అవకాశమని, ప్రజలు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద్ రావు సూచించారు.




## రామస్వామి కుటుంబానికి సహాయం..

**టి మీడియ, డిసెంబర్ 20, ఇనుగుర్తి:**
మండలంలోని అయ్యగారి పల్లి గ్రామానికి చెందిన కారంపూడి రామస్వామి ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశాడు. గ్రామ నూతన సర్పంచి మలిశెట్టి శోభన్ శనివారం బాధ్యత కుటుంబాన్ని సందర్శించి పరామర్శించారు. అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. 50 కిలోల బియ్యాన్ని సహాయంగా అందజేశారు. సర్పంచి వెంట కొనతం వెంకన్న , మాజీ సర్పంచ్ మామిడి శోభన్ బాబు,మాలోత్ భద్రు నాయక్, బానోత్ సంధ్య నాయక్, మామిడి కిరణ్, మామిడి భద్రయ్య, మలిశెట్టి రవి, బొర్ర శ్రీనివాస్, బొల్లు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ బాలుడ్ని కొట్టి.. కంట్లో కారం చల్లిన స్కూల్ నిర్వాహకులు

**టి మీడియా, డిసెంబర్ 20 , బెంగళూరు:**



దివ్యాంగ బాలుడ్ని స్కూల్ నిర్వాహకుడు దారుణంగా కొట్టాడు. అతడి భార్య మరింత దారుణానికి పాల్పడింది. దివ్యాంగ బాలుడి కంట్లో కారం చల్లింది. ఈ వీడియో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టారు. ఉత్తర కర్ణాటకలోని బాగల్‌కోట్‌లో ఈ సంఘటన జరిగింది. నవగర్ ప్రాంతంలో దివ్యాంగ పిల్లలకు సంబంధించిన దివ్యజ్యోతి వికలాంగ పిల్లల స్కూల్ ఉన్నది. కాగా, ఆ స్కూల్ నిర్వాహకుడు అక్షయ్ ఇందుల్కర్ 16 ఏళ్ల దివ్యాంగ బాలుడ్ని దారుణంగా కొట్టాడు. ప్లాస్టిక్ పైప్‌తో చితకబాదాడు. ఆ బాలుడు నేలపై పడి నొప్పితో ఏడుస్తున్నప్పటికీ కనికారం చూపలేదు. అక్షయ్ భార్య ఆనంది మరింత దారుణానికి పాల్పడింది. లోపలకు వెళ్లి కారం పొడి తెచ్చింది. ఆ దివ్యాంగ బాలుడి కళ్లల్లో కారం చల్లింది. మరోవైపు ఆ వికలాంగ స్కూల్‌కు చెందిన ఒక వ్యక్తి దీనిని మొబైల్ ఫోన్‌లో రికార్డ్ చేశాడు. దీంతో ఇది సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. వికలాంగ పిల్లల పాఠశాలల్లో పర్యవేక్షణ, భద్రత, జవాబుదారీతనంపై ప్రశ్నలు లేవనెత్తాయి. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించారు. కాగా, ఆ బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. అక్షయ్, అతడి భార్య ఆనందితోపాటు మరో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

# రీల్స్ చేస్తే చర్యలు తప్పవ్

- దేవస్థానం వార్నింగ్




**టి మీడియా,డిసెంబర్ 20 , శ్రీశైలం :**
భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని దేవస్థానం అధికారులు సూచించారు. ఆలయ పరిధిలో అన్యమత ప్రార్థనలు, బోధనలు, ప్రచారాలు, రీల్స్ చేయడంపై కఠిన ఆంక్షలు విధించినట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. శ్రీశైలం క్షేత్ర పరిధిలో అన్యమత బోధనలకు సంబంధించిన కరపత్రాలు, పుస్తకాలు పంపిణీ చేయడం నిషేధమని తేల్చి చెప్పారు. ఇలాంటి కార్యకలాపాలు చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. భక్తుల ఆధ్యాత్మిక భావాలను గౌరవిస్తూ ఆలయ పవిత్రతను కాపాడటం కోసమే ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. దేవస్థానం అనుమతి లేకుండా ఆలయ ప్రాంగణంలో వీడియోలు తీయడం, డ్రోన్స్ ఎగురవేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత వీడియోలు, రీల్స్, ఫొటోలు ప్రచారం చేయడానికీ అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ చర్యలు భక్తుల ప్రశాంతతకు భంగం కలగకుండా ఉండేందుకు, ఆలయ వాతావరణం శాంతియుతంగా ఉండేందుకు తీసుకున్నట్లు చెప్పారు. ఆలయ ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా కఠిన చర్యలు చేపడతామని చెప్పారు. ధూమపానం, మద్యపానం, జూదం ఆడడం, మాంసాహారం వినియోగం వంటి చర్యలు చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇటీవల శ్రీశైలంలో ఓ యువతి రీల్స్ చేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో అది కాస్త వివాదాస్పదంగా మారడంతో పాటు ఈ అంశం చర్చకు దారితీసింది. దీనిపై స్పందించిన యువతి తాను తప్పుగా రీల్ చేయలేదని.. తప్పు జరిగిందని భావిస్తే క్షమాపణలు చెబుతున్నట్లు చెప్పింది. కొంతమంది తనను ట్రోల్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆలయ ఈవో శ్రీనివాసరావు మరోసారి స్పందిస్తూ, భక్తులందరూ ఆలయ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఎవరు హద్దులు దాటినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. భక్తుల సహకారంతోనే ఆలయ నిర్వహణ సక్రమంగా సాగుతుందని, అందరూ అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# తండ్రి అండ, కొడుకు దందా- ఖాకీ పుత్రుడి ముఠా

**వెలుగులోకి అనేక అరాచకాలు**

**టి మీడియా, డిసెంబర్ 20 , పల్నాడు :**
అతని తండ్రి పోలీసు శాఖలో ఏఎస్సై. సమాజంలో నేరాలను అరికట్టాల్సిన బాధ్యత తండ్రిది అయితే, ఆ ఖాకీ చొక్కా మాటున అరాచకాలకు పాల్పడటం కుమారుడి వంతైంది. పల్నాడు జిల్లాలో కలకలం రేపిన ఘోర రోడ్డు ప్రమాదం కేసును పోలీసులు లోతుగా దర్యాప్తు చేయగా, తీగ లాగితే డొంకంతా కదిలింది. ఏఎస్సై కుమారుడు వెంకటనాయుడు నేర సామ్రాజ్యం బట్టబయలైంది. కేవలం వసూళ్ల దందాయే కాదు, ఏకంగా కార్ల చోరీ ముఠాను నడుపుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. వెంకటనాయుడు ముఠా చోరీ చేసిన కార్లను నరసరావుపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.




**బయటపడ్డ కార్ల డంప్**
వెంకటనాయుడు గ్యాంగ్ అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఈ ముఠా చోరీ చేసిన 8 కార్లను నరసరావుపేట పోలీసులు తాజాగా స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇప్పటికే గతంలో ఇదే ముఠా నుంచి 10 కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా ఈ గ్యాంగ్ 22 కార్లను చోరీ చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మిగిలిన కార్లను కూడా రికవరీ చేసేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ముఠా చిలకలూరిపేట పోలీసుల కస్టడీలో ఉంది. వారిని విచారణ చేస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**అసలేం జరిగింది**
అసలు ఈ వెంకటనాయుడు బాగోతం బయటపడటానికి కారణం ఈ నెల 4న జరిగిన ఘోర ప్రమాదమే. నాదెండ్ల మండలం గణపవరం సమీపంలోని చిలకలూరిపేట బైపాస్ వద్ద ఆ రోజు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో అయిదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. ఇది సాధారణ ప్రమాదం కాదని చిలకలూరిపేట గ్రామీణ పోలీసులు అనుమానించారు. సీసీ ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలించగా షాకింగ్ నిజాలు తెలిశాయి. వెంకటనాయుడు తన బృందంతో కలిసి హైవేపై వెళ్తున్న ఓ భారీ లారీని ఆపాడు. అక్రమంగా డబ్బులు వసూలు చేసే ప్రయత్నంలోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నాక, అసలు కథ వెలుగులోకి వచ్చింది.

**తండ్రి అండ, కొడుకు దందా**
ప్రమాదానికి కారణమైన వెంకటనాయుడు సామాన్యుడు కాదు. నరసరావుపేట డీఎస్పీ కార్యాలయంలో పనిచేసే ఏఎస్సై శ్రీనివాసరావు కుమారుడే ఈ వెంకటనాయుడు. ఏఎస్సై శ్రీనివాసరావు గత 15 ఏళ్లుగా నరసరావుపేటలోనే పాతుకుపోయారు. తండ్రికి ఉన్న అధికారాన్ని, పలుకుబడిని వెంకటనాయుడు తన దందాలకు పెట్టుబడి చేసుకున్నాడు. కుమారుడు ఎన్ని అరాచకాలు చేసినా తండ్రి ఎప్పటికప్పుడు రక్షిస్తూ వచ్చాడు. చివరకు పాపం పండింది. కుమారుడి అరాచకాలకు అండగా నిలిచినట్లు తేలడంతో ఎస్పీ సీరియస్ అయ్యారు. ఏఎస్సై శ్రీనివాసరావును మొదట వెల్దుర్తి ఠాణాకు బదిలీ చేసినా, విచారణ అనంతరం ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

**క్రైమ్ హిస్టరీ మామూలుగా లేదు**
వెంకటనాయుడి నేర చరిత్ర ఈనాటిది కాదు. 2023లో కోటప్పకొండ వద్ద ఓ భారీ దోపిడీకి స్కెచ్ వేశాడు. రూ. 2 వేల నోట్ల మార్పిడికి రూ. 10 లక్షల కమీషన్ ఇస్తానని ఆశ చూపాడు. తీరా బాధితులు వచ్చాక వారి కారుతో పాటు రూ. 50 లక్షలు దోచుకున్నాడు. ఈ కేసు అప్పట్లో సంచలనం సృష్టించింది. ఫైనాన్స్ కట్టలేక సీజ్ అయిన కార్లను, లేదా ఇతర మార్గాల్లో వచ్చిన కార్లను ఈ ముఠా సేకరిస్తుంది. వాటికి ఫేక్ నంబర్లు తగిలించి అమాయకులకు తక్కువ ధరకే అంటగట్టేవాడు. కేవలం కార్ల చోరీలే కాదు, గంజాయి క్రయవిక్రయాలు కూడా చేసినట్లు ఇతనిపై ఆరోపణలు ఉన్నాయి. కోటప్పకొండ కేసులో తండ్రి పాత్రపై ఎప్పటి నుంచో ఎస్పీ కార్యాలయంలో ఫైల్ పెండింగ్‌లో ఉండటం గమనార్హం. చివరకు ఐదుగురు విద్యార్థుల ప్రాణాలు పోయాక గానీ ఈ ఖాకీ పుత్రుడి అరాచకానికి అడ్డుకట్ట పడలేదు.

# రాజకీయ నిర్ణయం వరకూ తీసుకెళ్లొద్దు

## వారికి పవన్ కల్యాణ్ వార్నింగ్

**టి మీడియా, డిసెంబర్ 20 , అమరావతి :**

తెలుగుజాతి, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం విభిన్న పార్టీల భావజాలం నుంచి వచ్చి ఒక్కటయ్యాం అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఒకే కుటుంబం కోసం అందరం ఆలోచించామన్నారు. మీరు ఎవరిని ఆరాధిస్తారో వారిలాగే తయారవుతారన్నారు. 'నేను పొట్టి శ్రీరాములు, బూర్గుల, చంద్రశేఖర్ ఆజాద్‌ను ఆరాధించా. నేను క్రిమినల్స్, దోపిడీ, దగాకోరులను ఆరాధించలేదు. నేను హక్కుల కోసం పోరాడేవారిని ఆరాధించాను. రాష్ట్రానికి, ప్రజలకు మంచి జరగాలని నేను తగ్గి ఉన్నాను. నాకు స్వార్థం లేదు' అని పవన్ కల్యాణ్ వెల్లడించారు. నేడు తుర్పుగోదావరి జిల్లాలో పవన్ పర్యటించారు. నిడదవోలు మండలం పెరవలిలో రూ.3050 కోట్లతో చేపట్టిన అమరజీవి జలధార పథకానికి శంకుస్థాపన చేశారు.



**ఆ లక్ష్యంతో ప్రాజెక్టు రూపకల్పన చేశాం**

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు 5 జిల్లాల పరిధిలో రూ.7,910 కోట్లు ఖర్చు చేస్తాం. ప్రాజెక్టు ద్వారా 1.20 కోట్ల మంది దాహార్తి తీర్చాలన్నది లక్ష్యం. ఎక్కువ తీర ప్రాంతాలు కలిపే లక్ష్యంతో ప్రాజెక్టు రూపకల్పన చేశాం. 2027 నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలనే లక్ష్యంతో సాగుతున్నాం. బూర్గుల రామకృష్ణారావు, పొట్టి శ్రీరాములు ఎప్పుడూ నా గుండెల్లో ఉంటారు. గతంలో పొట్టి శ్రీరాములును వైశ్య కులానికి పరిమితం చేశారు. వందల కులాల కోసం పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేశారు. పొట్టి శ్రీరాములు గొప్పదనాన్ని నెల్లూరు జిల్లాకే పరిమితం చేశారు.తెలుగువారికి ఉనికి ఇచ్చిన వ్యక్తి పొట్టి శ్రీరాములు. ప్రాణత్యాగం చేసిన వ్యక్తి చనిపోయాక తీసుకెళ్లేందుకు ఎవరూ లేరు. నాడు ఘంటసాల ముందుకు వచ్చి పొట్టి శ్రీరాములు మృతదేహాన్ని ఖననం చేశారు. తెలుగుజాతి, ఆత్మగౌరవం అని మాట్లాడేందుకు మూల కారకుడు పొట్టి శ్రీరాములు. నాయకులకు కులాలు అంటగడితే కులాల సమూహంలానే ఉంటాం. కులం చూడకుండా ఆకలితో వచ్చిన వారికి డొక్కా సీతమ్మ అన్నం పెట్టారు. ఉచిత మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టడం సంతోషం. పొట్టి శ్రీరాములు గౌరవార్థం అమరజీవి జలధార పేరు పెట్టాం" అని పవన్ కల్యాణ్ తెలిపారు.

**పవన్ ఎప్పుడూ పవన్‌లానే ఉంటాడు**


ప్రాజెక్టు ఎందుకు ఆలస్యమంటూ వైఎస్సార్సీపీ నేతలు ఆరోపణలు చేస్తున్నారు. వైఎస్సార్సీపీ అధికారంలో ఉన్నప్పుడూ బెదిరింపులకు భయపడలేదు. దౌర్జన్యాలకు దిగుతూ మళ్లీ వస్తామంటూ దిగజారి మాట్లాడుతున్నారు. అధికారం ఉన్నా, లేకపోయినా పవన్ ఎప్పుడూ పవన్‌లానే ఉంటాడు. వైఎస్సార్సీపీ ఆకు రౌడీలకు యోగి ఆదిత్యనాథ్ వంటి ట్రీట్‌మెంట్ ఇవ్వాలి. ప్రభుత్వం తలచుకుంటే బలమైన వామపక్ష తీవ్రవాదమే కకావికలమైంది. రెండ్రోజులు కిరాయి గూండాలు, రౌడీల వివరాలు ఆరా తీస్తే పరిస్థితి తెలుస్తుంది. రౌడీలపై రాజకీయ నిర్ణయం తీసుకుంటే మళ్లీ ఇలాంటి మాటలు రావు. ఆరోపణలు చేసే వారిని హెచ్చరిస్తున్నా రాజకీయ నిర్ణయం వరకూ తీసుకెళ్లవద్దు" అని పవన్ హెచ్చరించారు.పొట్టి శ్రీరాములు పేరు చిరస్థాయిగా నిలిచిపోవాలని జలధార పెట్టాం. మళ్లీ అధికారంలోకి వస్తాం, అంతు చూస్తామని బెదిరిస్తున్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రతిపక్షాలు బెదిరింపులకు దిగితే సహించం. సోషల్ మీడియా ద్వారా బెదిరిస్తే సహించం, చర్యలు తీసుకుంటాం. నా ఆశయ సాధన కోసం ప్రాణాలు పోయినా బాధపడను. ప్రజల భవిష్యత్తు కోసమే తగ్గి పని చేశా. అమ్ముడు పోయానంటూ అనేక నిందలు వేశారు. ప్రజల కోసం నేను తగ్గి పనిచేయకపోతే అభివృద్ధి సాధ్యమేనా. నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవు." -పవన్?కల్యాణ్?, ఉప ముఖ్యమంత్రి

**ఉత్సాహం మంచిదే - నియంత్రణ పాటించాలి**

అయితే పవన్ కల్యాణ్ సభలో పెద్దఎత్తున అభిమానుల కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా బారికేడ్లు దాటుకుని ముందుకు రావద్దని అభిమానులను పవన్ వారించారు. ఇలాంటి పరిస్థితుల వల్లే నేను ఉన్న సభలకు ప్రధాని కూడా రావడానికి ఆలోచిస్తారన్నారు. ప్రధానికి ప్రపంచమంతా శత్రువులు ఉన్నారు, ఏ మూల నుంచి దాడి చేస్తారో తెలియదన్నారు. అభిమానులకు ఉత్సాహం మంచిదే కానీ నియంత్రణ పాటించాలని సూచించారు.

# పంచాయతీల్లో ఆర్థిక కష్టాలు

- కొత్త సర్పంచులు తర్జన భర్జన



నెలకొంది. ఇప్పటికే గత సర్పంచులు చేసిన పనులకు సంబంధించి రూ.11 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘ నిధులతో పాటు ఉపాధి హామీ పథకం, సాధారణ, పన్నుల వసూలు తదితర నిధులే ప్రధాన ఆదాయం. ఉద్యోగుల జీతభత్యాలకు 30 %, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, మంచి నీరు తదితర వాటికి 15 % చొప్పున, రహదారులు, కాల్వలకు 20, ఇతర అవసరాలకు 10 % నిధులు వెచ్చించాల్సి ఉంటుంది.

**ట్రాక్టర్ల కిస్తీలు కట్టలేని పరిస్థితి**


2019లో ఎన్నికల తరువాత అదిలాబాద్? జిల్లాకు రూ.118.95 కోట్లు మంజూరయ్యాయి. అయితే గత మూడు సంవత్సరాల నుంచి నిధుల్లో పూర్తిగా కోత పడింది. 2022-2023లో రూ.52.32 కోట్లు రాగా, 2023-2024లో రూ.39.61 కోట్లకు తగ్గింది. గత సంవత్సరం కేవలం రూ.26.10 కోట్లు వచ్చాయి. చివరకు ట్రాక్టర్ల కిస్తీలు కట్టలేని పరిస్థితి ఏర్పడింది.

**ఇలా ఆదాయం సమకూర్చుకోవాలి**

ప్రతి పంచాయతీకి ప్రభుత్వ గ్రాంట్లు, సొంత వనరుల ద్వారా, తమ వాటాగా లభించేవి, విరాళాల ద్వారా ఆదాయం వస్తుంది. జనాభాను బట్టి ఒక్కో వ్యక్తికి రూ.618 చొప్పున ప్రభుత్వ గ్రాంటు మంజూరు అవుతుంది. సొంత వనరుల్లో ఇంటి పన్నులతో పాటు ప్రత్యేకంగా లే అవుట్ ఫీజు, లైసెన్స్ ఫీజు, భవన నిర్మాణాలకు అనుమతుల రుసుం, సంతల రుసుము, కాంపౌండింగ్ ఫీజు, వేలం ద్వారా వచ్చే ఆదాయం ఉంటుంది.

**ఈ విధంగా స్పందిస్తేనే**

ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకొని స్పందిస్తే సగం సమస్యలను పరిష్కరించే వీలు ఉంటుంది. ఉపాధి హామీ కింద కొన్ని పనులు పూర్తి చేసుకునే వెసులుబాటు ఉంటుంది. వీటితో పాటు సమస్యలను ఎమ్మెల్యే, ఎంపీల దృష్టికి తీసుకువెళ్లి నిధులు రాబట్టుకోవచ్చు.



## రికార్డు స్థాయిలో

# ధాన్యం కోనుగోలు

తీసుకొచ్చింది.ఈ సీజన్‌లో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని సర్కార్ లక్ష్యంగా పెట్టుకున్నది. వానాకాలంలో 65.69 లక్షల ఎకరాల్లో వరి పంట సాగుచేయగా, 159.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. అందులో భాగంగా ముందుగా 75 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో.. అదనంగా మరో 5 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నది.అందుకు సన్నరకం, దొడ్డురకం ధాన్యానికి వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పీఏసీఎస్, ఐకేపీ, ఇతరులకు కొనుగోలు సెంటర్లను కేటాయించింది. ఈ సెంటర్ల నుంచి రాష్ట్రంలోని దాదాపు 121 లక్షలకు పైగా రైతుల నుంచి 58 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించగా.. ఈ వరి ధాన్యంలో సన్నధాన్యం 28 లక్షల మెట్రిక్ టన్నులు, దొడ్డుధాన్యం 30 లక్షల మెట్రిక్ టన్నువరకుసేకరించారు.పౌరసరఫరాల శాఖ లక్ష్యం మేరకు అక్టోబర్‌లో 6.89 లక్షల మెట్రిక్ టన్నులు, నవంబర్‌లో 32.95 లక్షల మెట్రిక్ టన్నులు, డిసెబంబర్ నెలలో 27.03 మెట్రిక్ టన్నులతో కలిపి ఈ మూడు నెలల్లో మొత్తం 64 లక్షల టన్నుల ధాన్యం సేకరణ టార్గెట్‌గా పెట్టుకున్నది. అయితే రెండు నెలల క్రితం మెంథా తుపాన్ కారణంగా ధాన్యం సేకరణ ఆలస్యమైం ది. నవంబర్ రెండో వారం నుంచి ధాన్యం కొనుగోలు ఊపందుకున్నది.ఈ నెలాఖరులోగా లక్ష్యం పూర్తిచేసేందుకు అధికారులు సేకరణలో వేగంపెంచారు. మరో 6 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ పూర్తిచేస్తే మూడు నెలలకు సంబంధించిన కోనుగోలు లక్ష్యం పూర్తయినట్లు అవుతుం ది. ఇక ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమఅవుతు న్నాయి. ఇప్పటివరకు రూ. 12,684 కోట్ల వరకు చెల్లింపులు జరిగాయి.అదేవిధంగా సన్న ధాన్యానికి క్వింటాకు రూ. 500 చొప్పున బోనస్ కూ డా.. ధాన్యం కొనుగోలు చేసిన పది రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నది. గతంలో బోనస్ నెలల తరబడి జమ కాకపోవడంతో రైతుల నుంచి తీవ్ర విమర్శలు ఎదురైనా యి. గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని బోనస్ విషయంలో ఇప్పుడు ఆ పరిస్థితి రాకుండా ప్రభుత్వం జాగ్రత్త పడుతున్నది.

**పక్క రాష్ట్రాల నుంచి రాకుండా కట్టడి**

రాష్ట్రంలో సన్నవరి ధాన్యానికి క్వింటాకు రూ. 500 బోనస్ చెల్లిస్తుండటంతో.. చాలా మంది దళారులు పక్క రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి సన్న వరి ధాన్యం తీసుకొచ్చి రాష్ట్రంలో విక్రయించేందుకు ప్రయత్నం చేశారు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, కర్నూల్, కృష్ణా జిల్లాల నుంచి ధాన్యం రాత్రి వేళల్లో తీసుకొచ్చి తెలంగాణ సరిహద్దు జిల్లాలలోని కొనుగో లు కేంద్రాల్లో అమ్మకాలు చేశారు.దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం గట్టి నిఘా ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి సన్నధాన్యం రాకుండా కట్టడి చేసింది. ఏపీలో మద్దతు ధర సాధారణ రకం క్వింటాకు రూ. 2,369, గ్రేడ్ 'ఏ' రకానికి రూ. 2,389 ఇస్తున్నారు. బోనస్‌లాంటి పథకం ఏపీలో లేకపోవడం..తెలంగాణ లో క్వింటాకు రూ. 500 బోనస్ ఇవ్వడంతో పెద్దమొత్తంలో ధాన్యం తీసుకొచ్చే ప్రయత్నంచే యగా, సంబంధిత శాఖ అధికారులు కట్టడి చేశా రు. జిల్లాల సరిహద్దుల్లో పోలీసుల పహారా, సీసీ కెమెరాలు ఏర్పాటు, ప్రతి వాహనం తనిఖీ చేయడంతో దళారుల ఆటలు సాగలేదని, దీంతో తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న బోనస్ డబ్బులు ఇక్కడి రైతులకే చెందుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

**12 జిల్లాల్లో కేంద్రాల మూసివేత**

వానాకాలం సీజన్‌లో వరిధాన్యం కొనుగోలు టార్గెట్ దగ్గరపడటం, చాలా ప్రాంతాల్లో వరిధాన్యం కొనుగోలు పూర్తి కావడంతో.. 12 జిల్లా లలో కొనుగోలు కేంద్రాలను కూడా మూసివేశారు. ముందుగా నిజామాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, నారాయణపేట, సిద్దిపేట, కరీంనగర్, జనగాం, మహబూబ్‌నగనర్, మంచిర్యాల, సంగారెడ్డి, జగిత్యాలో ధాన్యం కొనుగోలు ప్రారంభం కావడం.. ఆయా జిల్లాల లో ధాన్యం సేకరణ పూర్తి కావడంతో కొనుగోలు కేంద్రాలను మూసివేశారు.





జర్నలిజం ఉచిత శిక్షణ

టీ మీడియా (తెలుగు మీడియా) డిజిటల్ ఆధ్వర్యంలో జర్నలిజం వృత్తి శిక్షణ తరగతులు వారం (07) రోజులు పాటు రోజుకు గంట ఖమ్మంలో నిర్వహించబడును.

T MEDIA

సిలబస్ : సమాచర సేకరణ, వార్త రచన, పని పద్ధతులు

కనీస విద్యార్హత ఇంటర్ :

ఆసక్తి ఉన్నవారు తమ బయోడేటా 8919710365 కి వాట్సాప్ చేయగలరు.

నోట్ ఎటువంటి ఫోన్ చేయవద్దు, శిక్షణ స్థలం, తేదీ తరువాత తెలియజేస్తాము.

ఇట్లు
టీ మీడియా కుటుంబం


# నా బాయ్ ఫ్రెండ్ కాల్ లిఫ్ట్ చేయట్లేదు

- మా కాలేజీలో చోరీ జరిగింది



**టి మీడియా,డిసెంబర్ 20, ఢిల్లీ బ్యూరో :**

ఏంటివి అనుకుంటున్నారా? దేశ రాజధాని దిల్లీ పోలీస్ అత్యవసర సహాయ నంబర్ డయల్ 112కు వస్తున్న ఫోన్ కాల్స్‌లో చెబుతున్న మాటలు. కొద్ది రోజులుగా పెద్ద ఎత్తున ఫేక్ కాల్స్ నమోదవుతున్నాయి. ఆకతాయిలు కాల్ చేసి అలా చెబుతున్నారు. కాల్ అందగానే ప్రమాదం నిజమే అనుకొని పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంటున్నారు. తీరా అక్కడికి వెళ్లాక సమాచారం అబద్ధమని తేలుతోంది. ఫలితంగా ఈ ఫేక్ కాల్స్ బెడద పోలీసులకు సవాల్?గా మారింది. ఇతర రాష్ట్రాల్లోనూ ఫేక్ కాల్స్ బెడద ఉన్నా దిల్లీలో చాలా ఎక్కువ నమోదవుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. దేశ రాజధానిలో ఇలాంటి పరిస్థితి రావడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఫేక్ కాల్స్‌తో 112**

పోలీస్ రికార్డుల ప్రకారం, 2025 జనవరి నుంచి నవంబర్ మధ్య డయల్ 112కు వచ్చిన వందల కాల్స్‌కు ఎలాంటి అత్యవసర పరిస్థితులతో సంబంధం లేకపోయినట్లు తేలింది. మొత్తం 657 ఫేక్ కాల్స్ వచ్చాయి. కొందరు వ్యక్తులు చిన్న చిన్న వ్యక్తిగత సమస్యలను కూడా పోలీస్ అత్యవసర సేవలకే తీసుకువస్తున్నారు. ఉదాహరణకు, డెలివరీ బాయ్ సమయానికి సరుకులు తీసుకురాలేదని ఒక వ్యక్తి డయల్ 112కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. అలాగే, ఓ యువతి తన బాయ్‌ఫ్రెండ్‌కు పలుమార్లు కాల్ చేసినా ఫోన్ లిఫ్ట్ చేయలేదని, ఏదైనా ప్రమాదం జరిగిందేమో చూసేయండంటూ డయల్ 112కు సమాచారం ఇచ్చింది. విచారణలో ఎలాంటి అత్యవసరం లేదని తేలింది.

**మద్యం మత్తులో ఇంటి నుంచి వెళ్లిపోవాలన్న కాల్స్**

ఇంతకే పరిమితం కాకుండా, మద్యం మత్తులో ఉన్న సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోవాలన్న అభ్యర్థనలతో కూడా డయల్ 112కు తరచూ కాల్స్ వస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. కొన్నిసార్లు మద్యం మత్తులో పరస్పరం గొడవపడిన తర్వాత తప్పుడు సమాచారం ఇచ్చి పోలీసులను పిలుస్తున్నారు. గతంలో కూడా ఇలా పదేపదే ఫేక్ కాల్స్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో కూడా డయల్ 112ను దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

**కాలేజీల నుంచి కూడా తప్పుడు సమాచారం**

కొన్ని సందర్భాల్లో కాలేజీల నుంచి కూడా డయల్ 112కు చోరీ లేదా హత్య జరిగిందంటూ తప్పుడు సమాచారం అందినట్లు పోలీసులు తెలిపారు. అయితే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న తర్వాత ఎలాంటి సంఘటన జరగలేదని తేలింది. ఈ తరహా ఫేక్ కాల్స్ వల్ల నిజంగా అత్యవసర సహాయం అవసరమైన వారికి సేవలు ఆలస్యం అయ్యే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**డయల్ 112 %-% మల్టీ మోడల్ ఇంటిగ్రేషన్ వ్యవస్థ**

డయల్ 112కు సమాచారం అందగానే(పోలీస్ రెస్పాన్స్ వెహికల్) వెంటనే సంఘటనా స్థలానికి బయలుదేరుతుంది. ఈ వ్యవస్థ మల్టీ మోడల్ ఇంటిగ్రేషన్తో పనిచేస్తుంది. అంటే, అగ్నిప్రమాదం గురించి సమాచారం అందితే సంబంధిత కంట్రోల్ రూమ్ ద్వారా ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు కూడా సమాచారం ఇస్తారు. అలాగే, రోడ్డు ప్రమాదం జరిగిందని కాల్ వస్తే వెంటనే సమీప అంబులెన్స్‌ను కూడా పంపిస్తారు. ఈ విధంగా డయల్ 112 ద్వారా సమన్వయంతో సేవలు అందుతున్నాయి.

**గాజియాబాద్ కమిషనరేట్‌లో 97 వాహనాలు**

డయల్ 112 కింద గాజియాబాద్ కమిషనరేట్‌లో మొత్తం 97 వాహనాలు పనిచేస్తున్నాయి. వీటిలో 58 నాలుగు చక్రాల వాహనాలు, సన్నని వీధుల్లో చేరుకునేందుకు 39 రెండు చక్రాల వాహనాలు ఉన్నాయి. అదేవిధంగా డయల్ 112 సేవల కోసం 650 మంది పోలీస్ సిబ్బంది విధుల్లో ఉన్నారు. కాల్ వచ్చిన తర్వాత సంఘటన స్థలానికి చేరుకునే రిస్పాన్స్ టైమ్‌లో గాజియాబాద్ జిల్లాకు రాష్ట్రస్థాయిలో పలు మార్లు మొదటి స్థానం కూడా లభించింది.

**ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి**

డయల్ 112 అనేది నిజమైన అత్యవసర పరిస్థితుల కోసమేనని పోలీసులు మరోసారి గుర్తు చేస్తున్నారు. వ్యక్తిగత సమస్యలు లేదా తప్పుడు సమాచారంతో ఈ సేవను దుర్వినియోగం చేయొద్దని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. నిజంగా సహాయం అవసరమైన వారికి వెంటనే సేవలు అందాలంటే ప్రజల సహకారం చాలా అవసరమని అధికారులు సూచిస్తున్నారు.

# నేడు బీఆర్ఎస్ఎల్పీ మీటింగ్

## హైదరాబాద్ చేరుకున్న కేసీఆర్

చర్చించనున్నారు.



**ఉద్యమ స్వరూపానికి బీజం**

'బీఆర్ఎస్ ప్రభుత్వమే తిరిగి వచ్చి ఉంటే ఈపాటికి పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి నీళ్లు అందేవి. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల ప్రజల, రైతాంగ ప్రయోజనాలు కాపాడబడేవి. కానీ, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు పాలమూరు ప్రాజెక్టుపై పూర్తి నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నది. బీఆర్ఎస్ 90 శాతం పనులు పూర్తిచేయగా, మిగిలిన 10 శాతం పనులు చేయకపోవడంతో మూడు జిల్లాల ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రెండేండ్లు గడిచినా రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇంకా తెలంగాణ సమాజం మౌనం వహించజాలదు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు, కృష్ణా జలాల్లో కేవలం 45 టీఎంసీలకు ఒప్పుకోవడం క్షమించరాని ఘోరం. సాగునీటి అంశంలో తెలంగాణ రైతాంగ ప్రయోజనాలను కాపాడే విషయంలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నటికీ రాజీ పడబోదు' అని కేసీఆర్ స్పష్టంచేశారు. ఇలాంటి కీలక సమయంలో నీటి కేటాయింపులు, ఏపీ జలదోపిడీ వంటి విషయాలతోపాటు, పార్టీ సంస్థాగత నిర్మాణ విషయాలు సహా పలు అంశాలను నేడు జరిగే సంయుక్త సమావేశంలో పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన కూలంకషంగా చర్చ జరగనున్నది. అందుకు అనుగుణంగా చేపట్టబోయే ప్రజా ఉద్యమాల నిర్మాణం, అనుసరించాల్సిన కార్యాచరణపై కీలక నిర్ణయాలు ఉంటాయి. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల నిర్మాణం, జలాల కేటాయింపు, కృష్ణా, గోదావరి జలాల విషయంలో ఏపీ జలదోపిడీపైన పోరాడేందుకు ఒక ఉద్యమ స్వరూపానికి ఈ సమావేశంలో బీజం పడనున్నది.

**బీజేపీ విధానంపై పోరాటాలే శరణ్యం**

'పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 91 టీఎంసీలు కేటాయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కేవలం 45 టీఎంసీలు ఇస్తే చాలని కేంద్రం ఎదుట దేబరించడం బాధాకరం. 45 టీఎంసీలకు అంగీకరిస్తూ కేంద్రం వద్ద రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మోకరిల్లి రావడం రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను తాకట్టు పెట్టడమే. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేయడమే. రాష్ట్రానికి, ముఖ్యంగా పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల రైతాంగ ప్రయోజనాలు దెబ్బతింటున్న నేపథ్యంలో రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి కూడా ఒకరూ మాట్లాడిన పాపాన పోవట్లేదు. బీజేపీయే తెలంగాణ రైతాంగ ప్రయోజనాలకు గండి కొడుతున్నదనే విషయం స్పష్టమవుతున్నది. రాష్ట్రానికి సాగునీటి పథకాల విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని, కావేరి తదితర నదుల అనుసంధానం పేరుతో ఏపీ జలదోపిడీకి సహకరిస్తున్న కేంద్రం విధానాన్ని ఎదురోవాలంటే తెలంగాణ సమాజానికి మరోసారి ప్రత్యక్ష పోరాటాలే శరణ్యం' అని పార్టీ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు.

# అమరావతి రైల్వేలైన్‌కు 'భూ' చిక్కులు

- రైతుల పట్టు, సర్కార్ నిర్ణయంపై ఉత్కంఠ

విధానంలోనే తమ భూములు తీసుకోవాలని పట్టుబడుతున్నారు. దీంతో ప్రాజెక్టు భవితవ్యం ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం చేతిలోకి వచ్చింది. పల్నాడు, గుంటూరు జిల్లాల రైతుల డిమాండ్‌పై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

**రైతుల పట్టు, అధికారులకు నో ఎంట్రీ**

ఎర్రుపాలెం నుంచి నంబూరు వరకు 56.53 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్ నిర్మించాల్సి ఉంది. ఈ మార్గం రాజధాని అమరావతి మీదుగా వెళ్తుంది. ఇందుకోసం భూసేకరణ చేసేందుకు రైల్వే అధికారులు రంగంలోకి దిగారు. అయితే, పల్నాడు, గుంటూరు జిల్లాల రైతులు అధికారులను అడ్డుకున్నారు. కనీసం భూములను కొలిచేందుకు, 'పెగ్ మార్కింగ్' (హద్దులు నిర్ణయించడం) చేసేందుకు కూడా అనుమతించలేదు. తమకు డబ్బులు వద్దని, సమీకరణ విధానంలో అభివృద్ధి చేసిన ప్లాట్లు కావాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో చేసేది లేక రైల్వే శాఖ, ఈ వ్యవహారంపై తగిన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

**ఎక్కడెక్కడ అభ్యంతరాలు**

ఈ రైల్వే లైన్ మూడు జిల్లాలు, పలు మండలాల మీదుగా సాగుతుంది. ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం మండలంలోని 2 గ్రామాలు. ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలంలోని 6 గ్రామాలు, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం మండలాల్లో రెండేసి గ్రామాలు ఉన్నాయి. అలాగే పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని 3 గ్రామాలు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలో 2, తాడికొండ మండలంలో 3, పెదకాకాని మండలంలో 2 గ్రామాలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా పల్నాడు జిల్లాలోని మూడు గ్రామాలు, గుంటూరు జిల్లాలోని ఏడు గ్రామాల రైతులు భూసేకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

సమీకరణ దిశగా సర్కార్ చూపు

రాజధాని కోసం గతంలో భూసమీకరణ చేశారు. ఇప్పుడు మిగిలిన గ్రామాల్లో రెండో విడత సమీకరణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇదే సమయంలో రైల్వే లైన్ కోసం కూడా అదే విధానాన్ని పాటించే అవకాశం ఉంది. పల్నాడు జిల్లాలోని వైకుంఠపురం, ఎంద్రాయి, కర్లపూడి గ్రామాల్లో సమీకరణ చేసే అవకాశం ఉంది. గుంటూరు జిల్లాలోని వడ్డమాను, పెదపరిమి గ్రామాల్లోనూ ఇదే విధానం అమలయ్యే ఛాన్స్ ఉంది. అయితే మోతడక, తాడికొండ, కంతేరు, కొప్పురావూరు, పెదకాకాని గ్రామాల్లో పరిస్థితి ఇంకా సందిగ్ధంగానే ఉంది. ఇక్కడ భూమిని సమీకరిస్తారా? లేక పాత పద్ధతిలో సేకరణ చేపడతారా? అన్నది ప్రభుత్వం తేల్చాల్సి ఉంది.

పనులు ఆగకూడదని, ప్యాకేజీల ప్లాన్

భూ సమస్య ఉన్న చోట పనులు ఆగిపోయినా, మిగిలిన చోట్ల పనులు మొదలుపెట్టాలని రైల్వే శాఖ నిర్ణయించింది. అందుకే ప్రాజెక్టును ప్యాకేజీలుగా విభజించింది. మొదటి ప్యాకేజీ కింద ఎర్రుపాలెం నుంచి వైకుంఠపురం సమీపం వరకు 27 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ నిర్మిస్తారు. ఇక్కడ భూ సమస్య పెద్దగా లేదు. రెండో ప్యాకేజీ కింద కృష్ణా నదిపై 3.2 కిలోమీటర్ల మేర భారీ వంతెన నిర్మిస్తారు. ఇది అత్యంత కీలకమైన ఘట్టం.

టెండర్లు పూర్తి, రెండేళ్లలో కూత

ఈ రెండు ప్యాకేజీలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఈ నెలాఖరులోపు పూర్తి కానుంది. టెండర్లు ఖరారైన వెంటనే పనులు మొదలవుతాయి. గుత్తేదారు సంస్థకు పనులు అప్పగించిన నాటి నుంచి రెండేళ్లలో రైల్వే లైన్ నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కృష్ణా నదిపై వంతెన నిర్మాణం మాత్రం మూడేళ్లలో పూర్తయ్యే అవకాశం ఉందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. భూ సమస్య ఉన్న మిగిలిన గ్రామాల పరిధిలోని పనులను 'మూడో ప్యాకేజీ' కింద చేపడతారు. ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకుంటే, అమరావతి రైలు కల త్వరగా సాకారం అవుతుంది.